కథానిక:

# రాలుపండు

## శ్రీ కవికొండల వెంకటరావు

కాళ్ళు ఎడంగా పెట్టి ఆలా నించున్న పాళంగా కుచ్చెళ్ళు పై కెగ్గదోసుకు, మట్టి మొయ్యడానికి సిద్ధమయ్యే కూలియాండ్రు, ఉదయం వెలుగు సోకల కల్లాడే కళ్ళమూపుల్లో తమతమ మగవాళ్లకు ఆనందం గొలుపుతూ, "ఇంకా బద్ధక మేనర్రా ? ఎండ చుఱచుఱ పొడిచేని ఈ పెనుంచి. గునపాలెత్తుకు పొడుండి బెడ్డ. ఓవరుసీర్ గారొచ్చారూ అంటే పొడుగు వెడల్పు కొలిచేరు." అన్నయ్యాసు చిలకల పలుకుల్లా గోరింకల యులివుల్లా, ఊకొట్టబడకుండా, ఉత్సాహం గొలుపుతూవుంటే చెరువు మెఱకతీసే స్తున్నారు, ఉప్పరలు. కులం అడిగితే" తెలగా ఉప్పరలం" అన్నారు.

స్త్రీల కాళ్లను అంతంత లావు కడియాలు అందెలు అన్యోన్యం తగిలి ధ్వనిస్తున్నాయి. మధ్య మధ్య మట్టెలున్నవో ) ) ° నినదిస్తున్నాయి. నిండుతట్ట లెత్తుకుంటూ వున్నప్పుడల్లా మెళ్ళో ఏవేవో లోహపు చేరులు ఊగిస లాడుతున్నాయి. మఱి పురుషులు మట్టి తవ్వుతూంటే చుట్టుపట్ల చెట్లు చేమలు గాలిలేకుండానే కదలాడుతున్నాయి. స్త్రీ పురుషులను ఆ తెగలో నెవళ్లను చూచినా ఒక్కళ్లో "అహీన సత్త్వులు" కాపడలేదు. దంప తిరిగి మంప తిరిగి వడేసుకుపోయిన కండబలుపు నేర్పరించు కుంటూ మగవాళ్లు ఉద్దండుల్లా తోచేరు. మఱి వాళ్ల ఆడవాళ్లున్నా తత్తుల్యలు గానే ఏపు రూపుగల వాళ్ళై సూదివాడి చూచుకాల్తో చూపరకింపు గొల్పేరు.

లెక్కకు అది శిశిరఋతువైనా వెచ్చదనానకు వేడుకలకు నవ్యవసంతంలా వుంది కాలం. వేపచెట్లు పూతబట్టాయి. మామిడిచెట్లు ముందు కాపువో కొన్ని అప్పుడే టెంకగట్టిన పెద్దకాయల్తో తులతూగు తున్నాయి. ఈతచెట్లు గెలలు దిగాయి. ఎప్పుడూ ముంజలే ఏమో అన్నట్టు ఒకొక్కొక్క తాడిచెట్టులు ఆకులు గొడుతూవుంటే కాయలు కూడా వూడిపడుతు న్నాయి. అక్కడక్కడ, పక్షి, పశువు, పొలంమధ్య విచ్చలవిడి వాలి నిలబడి పరకాయింపున కొచ్చేని.

మనుష్యుల సందడి మట్టిపోసే గట్టువెంబడినే గాని ఇతరత్రా కానరాదు. అక్కడమాత్రం తవ్వే వాళ్లు తవ్వుతూవుంటే పోసేవాళ్లు పోస్తూవుంటే, కెవ్వుకేరింత విశేషం వాళ్లవాళ్ల పిల్లలు గావిస్తూ పనికీ సంసారానికీ వ్యత్యాసం లేదనిపించేరు.

చిన్నపిల్లలు ఆకాశంక్రింద ఆరుబయటనే వున్నారు. స్త్రీలు ఆకాశంక్రింద ఆరుబయటనే వున్నారు. పురుషులు ఆకాశంక్రింద ఆరుబయటనే వున్నారు. అందరూ ఆకాశంక్రింద పనిచేస్తూనట్టే వున్నారు. "వీళ్ల యిళ్లెక్కడ? వాకిళ్లెక్కడ వీళ్లకు ?" అనే వూహ నాకళ్లల్లో కెక్కి అయిదారు సారలు చూచాను. ఆచుట్టుప్రక్కల ఇళ్ళూలేవు. వాకిళ్ళూలేవు. గ్రుమ్మలూ లేవు ముల్లెలూ లేవు. చెరువు ఆయకట్టు నున్న సుక్షేత్రఖండిక అంతా పంట కోసివేసిన నట్టె మైదానం! మళ్లీ వ్యవసాయం అన్నది వాన కారిస్తేనే! చెరువునిండితేనే! అంత ఎత్తున వాళ్లు గట్టుపోస్తూంటే, వాన కురవకేం చేస్తుంది ? చెరువునిండకేంచేస్తుంది ?

ఈచివరి, వాక్యాలు మానవుని ఆశయ వాక్యాలు-మహాదేవుని ఆశీర్వచన వాక్యాలు-కాగా ఆచోటు విడిచి సోమరితనంగా తిరుగుతూను దోవ ట్టుకు ఆసుక్షేత్ర ఖండికనే నడకను జేరుకున్నాను. బాగా తొమ్మిదిగంటలయింది. ఎండ అప్పడే చుఱ్ఱు మంటూవుంది. ఒకమామిడిచెట్టు నీడను ఒకముసిలివాడు 70, 80ఏళ్లవయస్సువాడు ఊదాగు ఊచల్తోతట్టల్లుతూ ఉండుండి ఒక ఎండుతాటాకు ఏత్తుతూ "బోడికుంక బొజ్జనిండా పాలుతాగి బజ్జున్నాడు!" అని అనుకొన్నాడు పైకిబిగ్గఱగా. ఆమాట వింటూ "తాతా తాటాకుక్రింద దేన్ని పలకరిస్తున్నావు?" అన్నాను. "నామునిమనుమడు బాబుగారూ! ఆళ్లమ్మ మొన్ననే ఈ చెట్టుక్రిందే నీళ్లాడింది. ఈలాంటి నా ముల్ని నా కొప్పజెప్పి పోతారువీళ్లు!" అని అన్నాడు. "ఎక్కడికి పోయింది?" "ఎక్కడకేంటి? పనిలోకి! అదిగో ఆ నడుంబిగించుకు తట్టెత్తుకున్న తక్కలాడే నామనుమరాలు—కొడుకు కూతురు. దానినిసుగే ఈ కసుగందు!" అంటూ తాత తాటాకు ఎత్తిచూపాడు. "అయితే ఇదన్నమాట మీ సంసారం! మీ ఉనికి పట్టూను! ఆ కాడ ఆగట్టుపోసేచోట కాదన్నమాట! మీ అందఱూ అక్కడే వుండేరు అని అనుకున్నాను. ఇక్కడ కూడా కొందఱు

వున్నారు!" అన్నాను. "వాళ్లూ ఇక్కడకే వస్తారు కూస్పేపట్లో—ఇఖమతి పొద్దువాలాక పని చేయం మేము. అన్నాలొండుకు తిని తొంగుంటాము! దీపాలా? దివ్వెలా? సుక్క వెలుగు సూసుకుంటానో, వెన్నెలవేళ ఊసులాడుకుంటానో మాకు తెలియకుండా నేకునుకొత్తాం!—అయితే మా సంసారం, మా ఇల్లు, మా పొలం, ఇక్కడాలేదు అక్కడాలేదు. మేం తెలగా ఉప్పర్లం! మాకు ఒక్కొక్కళ్లకు మా వూళ్లో పదేసి ఎకరాలభూమి, పైని పెంకుటి కప్పాలుండే భవంతులు వుండాయి బాబుగారూ! అయితే వేసంగిలో మాకేం పనీపాట వుండక ఇలా కుంటలు తవ్వుతూ కూలీనాలి పైఖర్చుకన్నా వుంటుందని సంపాదించుకు ఆలాఆలా తొలేకాశికి సొంతవూరు చేరుకుంటాం. ఇదో వ్యాపకం! గాపకం వుంచుకోండి! దండాలు!" అన్నాడు.

ఆ వృద్ధుని కేసి చూస్తూ చిరునవ్వు నవ్వి "నీ ముఖం జ్ఞాపకం వుంచుకోమంటావా? నీ మునిమనుమని ముఖం జ్ఞాపకం వుంచుకోమంటావా?" అని అడుగుతూ ఆ శిశువుకింకా పరిసికను గొంటూ వున్నాను.

"ఆడిదంతా నా పోలికేనండి బాబుగారూ!" అంటూ తాను కూడా నా చెంతకువచ్చి ఆ ఎండు తాటాకు ముఱుగు నింకాతీసి చూపేడు. "ఈ కూసు నిల్లా, కుండా మండా పడేసి వెళ్లిపోయినట్టు తాటాకు కింద పడేసి తల్లి వెళ్లిపోవడమే! ఇదేమి మానవలక్షణము?" అన్నాను నేను బిడ్డను పరకాయిస్తూ. "చూడండి! బాబుగారూ! ఆమడిలో గేదె ఈనుతూన్నట్టుంది. చూడు గేదెను కూడా తోలుకువచ్చాను ఒక దాన్ని పాడి గేదెలతోపాటు నాము గడ్డి డొంక చిగురు తింటుందని. ఆగేదె ఈనుతూన్నట్టుంది. నేనుపోయి కనిపెట్టి చూచివస్తాను. తమరుకుసింత ఈ బిడ్డని కనిపెట్టి చూస్తూ వుండండి. వాళ్లమ్మవచ్చే వేళ కావస్తూంది. పొద్దు నెత్తిమీదకు వచ్చేసింది." అన్నాడు ముసలివాడు. నేనున్నూ "మీతో గేదెల్ని ఆవుల్ని కూడా తోలుకువస్తారా?" అన్నాను. "లేకుంటే గొఱ్ఱెచల్ల మేకపాలు తాగి ఎవరుండగలరు ఈ లోకంలో. నా మట్టుకు నేను ఇప్పటికీ కూడా చింతగింజమునుగని గేదెమజ్జిగ తన్వేడు రోజూ తాగుతాను. ఈ గేదెలన్నవి ఆవులన్నవి—మాయింట అన్నీ బుట్టినవే. మాం మనుష్యులం ఎల్లాంటి వాళ్లమో మాపాడి పంటా కూడా అలాంటిదే," అంటూ గర్వంగా ఇంకో దెసనున్న చెక్కలోకి వెళ్లిపోయి అక్కడ నేలనుపడ్డ చిన్న గేదె దూడను గోళ్లుతీస్తూ మఱి నావంక చూడలేదు.

నేనున్నూ నాయెదుటనున్న చిన్నారి పొన్నారి శిశువుయొక్క చిన్న చేతులు చిన్న కాళ్లు చిన్న మొగము చిన్న బొజ్జ—చిన్న—చిన్న—చిన్న—అన్నీ చూస్తూ ఆ బిడ్డని తల్లి ఎవరో చూడవాంఛింపదొడగేను. ఆమె నడుం బిగించుక, తట్టను మట్టిదులువుకొంటూ, చెమ్మట మొగంతో చెదిరిన ముంగురులతో చేపాచ్చే రొమ్ములతో—"అమ్మడేడీ! నాగుమ్మడేడీ!" అనే సంబోధన నల్దిక్కులూ ప్రతిధ్వనించేలా చేరవచ్చింది. నేను ఆమెను చూస్తూ "అమ్మా! ఈబిడ్డడికి కొమ్మను వుయ్యాలా వేసి, అందులో పరుండబెట్టి మఱిపోలేక పోయావా" అని అడిగాను. "కొమ్మలనిండా మామిడికాయలేనండీ! ఏపొద్దొచ్చి చెట్టుఖామందులు దింపించుకునేరో! మమ్మల్ని లేచి పొమ్మని అనేరో! ఈనీడవాడ మాదేమన్నా గనుకా? మా ఇల్లు వాకిలి "రాగంపేట" లో వున్నాయి. ఈ చుట్టుపట్ల లేవు—మా తాత ఎల్లా వెళ్లాడు?—తమరెవరూ?" అని అడిగింది ఆమె.

తాత అప్పటి కప్పుడే చిట్టిగేదె దూడను లేవనెత్తి దానికి నడక నేర్పుతూ మమ్మల్ని చూచి "తంవరు ఇల్లారాండి!" అని నన్ను తనవైపునకు పిలిచేడు. తాత అనిమేషమప్పుడు నాకో నియంతలా తట్టాడు. వానివైపునకు వెంటనే నడచివెళ్లాను. "చూడండి! బాబుగారు, ఇంక ఆబిడ్డణ్ణి ఆడితల్లే చూచుకుంటుంది. మఱి తెల్లాఱిగాని పనిలోకి వెళ్లదు అది—ఈగేదె చూచారా! ఎంతలో ఈనిందో! ఈ దూడని చూడండి! చూడండి!" అన్నాడు అతి ఆప్యాయంగా. నేను వెంటనే అప్పుడు పుట్టిన దూడ వంకకు చూస్తూ—ముసలివానితో "నీకు ఈదూడ ఎక్కువా? ఆముని మనుమడు ఎక్కువా?" అని అడిగాను. "మనమింకా బిడ్డొంకా చూణ్ణక్కఱలేదు. తల్లే చూసుకుంటుంది—దీనొంకే చూడాలి!—ఇదే నాకెక్కువ! తమరికి దేనియందు మక్కువ?" అని అడిగాడు.

మామిడిచెట్టునుండి అప్పుడే ఒక మామిడిపండు పడింది. ముసలివాని ప్రశ్నకు సరియైన జవాబు చెప్పకుండా—"పళ్లడుతూన్నట్టుందే చెట్టు!" అన్నాను. "బాబుగారిదా ఆచెట్టు?" అని అడిగాడు. "ఉ!" అన్నాను: "అందుకే అంత మమకారంగా చూచారు ఆపండు రాలి పడుతూంటే" అన్నాడు తాత. అంటూ తాత భూమిమీద కొఱిగేడు.

రాలుపండును చూచినదాని కంటె ఎక్కువ మమకారంతో ఆ ఒఱిగే ముసీలి తాతవంకకు చూచాను.—వానినాడి లేనిచేయి ఆ లేగదూడకు నడక ఇంకా నేర్పుతూన్నట్టే వుంది.

చెట్టునుండి పడిన రాలుపండు ఆ బాలెంతరాలు తీసి, తాత అల్లే కొత్త ఊడుగు ఊచల తట్టెకలో పడేస్తూవుంది. "అమ్మో! మీతాత చనిపోయినట్టు న్నాడు" అని కేకేశాను. ఆ పచ్చిబాలెంత ఎల్లావున్న శిసువు నల్లావిడిచి- ఎల్లావుంచిన పండు నల్లావుంచి— "ఆఁ! తాతే! నాతాతే" అంటూ పెద్దబొబ్బ లెత్తుకుంటూ ఏడుస్తూ దరిసింది. కొలము వాళ్లందఱూ కుంటలు త్రివ్వడం మాని గుంపుగా మూగేరు. గోలగా తాతను పరిశీలించేరు.

నేను వాళ్లందఱినుండీ తప్పుకుని మామిడిచెట్టు క్రిందకువచ్చి, చిట్టికందుని చూస్తూ, "వీనిని చూచే దిక్కు ఆలోచించకే అందఱూ అటు వెళ్లిపోయినారు!" అని కాసేపు వానిప్రక్క నిలిచి, కొత్త తట్టలోవున్న రాలుపండు కేసి మధ్యమధ్య చూచిన వాణ్ణై "తాత ఈపండుకంటె సునాయాసంగా జారిపోయాడు" అని తలపోశాను.

మర్నాడు నేను మామిడిచెట్టునుండి కాయలు దింపించే వేళకు చెట్టుకింద అంతాఖాళీ! బంటా వాళ్లందరూ వాళ్ల గేదెలతో సహా ఆవులతో సహా పయనమైవాళ్ల వూరు వెళ్లిపోయినారు.

వారి కొలంలో ఒక కుఱ్ఱను కొత్తగా పుట్టినట్టు, కొత్తగా ఒక ముసిలి అతను చనిపోయినట్టు ఏవూరి లెక్కల్లోను ప్రదర్శింప బడినట్టులేదు. ఎక్కివుంటే దేవుని లెక్కల్లోకెక్కి వుండాలి.

---

# ఆర్థిక తత్త్వము

శ్రీ తెన్నేటి విశ్వనాథము

## ప్రథమ పాఠం

ధనము హెచ్చైన, వస్తువ తక్కువైన
ధరలు పెరుగును; తగ్గును ధనము విలువ;
ధనముతగ్గిన, వస్తువదండియైన
ధరలు విరుగును, హెచ్చును ధనమువిలువ.

## ద్వితీయ పాఠం

వెండి బంగారునాణాలు తిండియనుచు
చెప్పగా శక్తి లేనట్టి సీమకాకి
తాల ధనమతి విస్తారతయు గలిగిన
కాకితధనమే హెచ్చగ కాంక్షజేయు.

కాకితధన విస్తారము కాంతుగొలుపు
పైడిపైన; వస్తుధరలు పైకెగయును,
పరులు మనధనమును తగ్గుబరతురండి,
తగదు బంగరు విన, కాకితాలధనము.

## తృతీయ పాఠం

మంచిలోహంపు నాణాలు మైత్రిగాంచి
చెడ్డలో హంపు నాణాలు చేరితిరుగ
చెడ్డలోహంపు నాణాల చెయ్యిహెచ్చు,
మంచిలో హంపు నాణాలు మరుగుజెందు.

అంతియేగాదు పరజన ప్రాంతమందు
నాణెము విలువతగ్గును, నాణెములకు
లోహపువిలువే తక్కును, లోకులార
సత్య సూత్రంబు సకల శాస్త్రవిహితంబు
మంచి నాణెంబులన్నియు మంచి విలువ
తెచ్చుట నితర దేశాల తెన్నుగాంచు
ధనముచే పోషణంబగు ధరణియందు
తప్పనీ ధర్మములు వేరు చెప్పనేల?

---